మోతీలాల్‌నాయక్‌కు ఈటల పరామర్శ



గాంధీఆస్పత్రి: నిరుద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలని సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో గత ఆరు రోజులుగా ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న నిరుద్యోగ జేఏసీ నాయకుడు మోతీలాల్‌నాయక్‌ను మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ శనివారం పరామర్శించి ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈటల వెంట సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి..

గాంధీఆస్పత్రి: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ రెడ్డి కోరారు. గాంధీ ఆస్పత్రిలో గత ఆరు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న నిరుద్యోగ జేఏసీ నాయకుడు మోతీలాల్ నాయక్‌ను శనివారం ఆయన పరామర్శించి మద్దతు ప్రకటించారు. బీజేవైఎం అధ్యక్షుడు మహేందర్, నాయకులు మహేష్, వినీత్, అరవింద్, ఆదిత్య, ఆయూష్ పరామర్శించారు.

నేడు హరీష్‌రావు రాక..

నిరుద్యోగుల డిమాండ్ల సాధన కోసం గాంధీఆస్పత్రిలో ఆమరణ దీక్ష కొనసాగిస్తున్న జేఏసీ నాయకుడు మోతీలాల్‌నాయక్‌ను ఆదివారం ఉదయం 11 గంటలకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు తన్నీరు హరీష్‌రావు పరామర్శించనున్నట్లు హరీష్‌రావు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

డీ.శ్రీనివాస్ మృతి రాజకీయాలకు తీరని లోటు



డీఎస్ పార్థివ దేహం వద్ద నివాళి అర్పిస్తున్న కార్తీకారెడ్డి

లాలాపేట: మాజీ మంత్రి డీ. శ్రీనివాస్ మృతిపట్ల మాజీ మేయర్ బండా కార్తీకచంద్రారెడ్డి సంతాపం ప్రకటించారు. శనివారం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో డీఎస్ పార్థివదేహం వద్ద నివాళి అర్పించారు. రాష్ట్ర రాజకీయాల్లో డీఎస్‌ది చెరగని ముద్ర అన్నారు. వీరన్న, సంపత్, కిరణ్‌గౌడ్ నివాళి అర్పించారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ప్రొ.సయ్యద్ తలత్ సుల్తానా



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీకి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా అరబిక్ డిపార్టుమెంట్ అధ్యాపకురాలు ప్రొ.సయ్యద్ తలత్ సుల్తానా నియమితులయ్యారు. ప్రస్తుత ప్రిన్సిపల్ ప్రొ.అర్జున్‌రావు ఉద్యోగ విరమణతో ఆమెను నియమించారు.ఇదిలా ఉండగా సామాజిక శాస్త్రాల (సోషియల్ సైన్స్) డీన్‌గా ప్రొ.ఏవీ సతీష్ చంద్ర, పొలిటికల్ సైన్స్ హెడ్‌గా ప్రొ. కృష్ణకుమార్ నియమితులయ్యారు.

పూర్వవిద్యార్థుల దాతృత్వం

పాఠశాల అభివృద్ధికి రూ.6 లక్షల వితరణ



చెక్కును అందిస్తున్న పూర్వ విద్యార్థులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని వేదిక్ విద్యాలయంలో మూడు దశాబ్దాల క్రితం పది పూర్తి చేసిన విద్యార్థులు సందడి చేశారు. 1992 బ్యాచ్ విద్యార్థుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం వేదిక్ పాఠశాలలో నిర్వహించారు. నేటికీ వేదిక్ పాఠశాల రూపురేఖలు యథాస్థితిలోనే ఉండడంతో తాము చదువుకున్న తరగతి గదుల్లో కూర్చొని బాల్య స్మృతులకు గుర్తు చేసుకున్నారు. 32 సంవత్సరాల క్రితం ఇక్కడ పదవ తరగతి పూర్తి చేసి యూఎస్, యూఏఈ, యూకే, సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో స్థిరపడిన వారు కూడా పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరయ్యారు. అనంతరం పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు సహాయంగా రూ. 6 లక్షల చెక్కును పాఠశాల యాజమాన్య కమిటీకి అందించారు. కరోనా సమయంలో తల్లితండ్రులకు కోల్పోయిన 18 మంది బాలలను చేరదీశారు. వారందరికీ 10వ తరగతి వరకు అవసరమైన అన్ని ఖర్చులు తామే భరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల అవసరాల కోసం ఆటోమేటిక్ జిరాక్స్ మెషిన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యసమాజ నిర్వాహకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు జయరాజ్‌ఆర్య, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు హరిప్రసాద్, సజీశ్, మధు, ప్రకాశ్, శివకుమార్, జ్యోతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ (4 పోస్టులు), సైకాలజీ (02), బిజినెస్ ఎనలిటిక్స్ (01), ట్యాక్సేషన్ (01), బీబీఏ (01), బీసీఏ (01), బీబీఏ ఈ-కామర్స్ (01), కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ (05), డేటా సైన్స్ (01), స్టాటిస్టిక్ (01), అప్లైడ్ న్యూట్రిషన్ (01 పోస్టులు) మొత్తం 19 అధ్యాపక ఖాళీలను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులకు పీజీలో కనీసం 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు వచ్చి ఉండాలన్నారు. ఎన్ఈటీ, ఎస్ఎల్ఈటీ, ఎస్ఈటీ, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 5 సాయంత్రం 5 గంటల లోపు మహిళా డిగ్రీ కళాశాలలో తమ దరఖాస్తులను సమర్పించాలని 6న ఉదయం 10 గంటలకు ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు అందుకున్న మహిళలు

సనత్‌నగర్: జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో భగవంతపురం బస్తీకి చెందిన మహిళా గ్రూప్ సభ్యులకు జ్యూట్ బ్యాగుల తయారీ, టైలరింగ్‌లో ఆరు నెలల పాటు శిక్షణ ఇచ్చారు. శనివారం శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ మాల కొండయ్య, అప్స సంస్థ కోఆర్డినేటర్ బసవరాజు మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. రూపకళ, హేమలత, సుమలత, నిర్మల, అన్నపూర్ణ, వందన, పల్లవి, అనిత సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు వరలక్ష్మి, రాజేశ్వరి, శోభారాణి, బస్తీ కమిటీ అధ్యక్షుడు శ్యాంసుందర్, దయాకర్ రెడ్డి, దర్గా కరుణాకర్, జ్ఞానేశ్వర్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి పల్సర్ ఎన్ఎస్ -400జెడ్



రాంగోపాల్‌పేట్: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో స్పోర్ట్స్ సెగ్మెంట్‌లో రూపొందించిన పల్సర్ ఎన్ఎస్-400 జెడ్ బైక్‌ను శనివారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. సికింద్రాబాద్ ఎస్పీరోడ్‌లోని యాత్రినివాస్ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదరాబాద్ యునైటెడ్ బైకర్స్ క్లబ్ (హెచ్‌యూబీ) ప్రెసిడెంట్ హర్జీత్, వైస్ ప్రెసిడెంట్ జాన్, సన్నీ, జాకబ్, ఫిమేల్ రైడర్ దీపిక ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బజాజ్ ఆటో తెలంగాణ రీజనల్ మేనేజర్ కల్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ.. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ట్రాక్షన్ కంట్రోల్‌తో వచ్చిన ఈ బైక్ రైడింగ్‌లో నాలుగు మోడ్స్‌లో తయారయిందని ఈ మోడ్స్‌తో వాహనం నడిపే వ్యక్తులకు ఎంతో రక్షణ, ప్రత్యేక అనుభూతి ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్వీస్ ఆర్ఎం స్టాలిన్, సేల్స్ ఏఎస్ఎం సూర్య, మౌర్య పాల్గొన్నారు.

ఓయూలో సాయిచంద్‌కు నివాళి



సాయిచంద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: కవి, గాయకుడు, ఓయూ పూర్వ విద్యార్థి దివంగత సాయిచంద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా విద్యార్థి నాయకులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ (అంసా) అధ్యక్షులు నామా సైదులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అంసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంచాల లింగస్వామి, గాజుల ప్రభాకర్ హాజరై సాయిచంద్ చిత్ర పటానికి నివాళి అర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య, తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు వలిగొండ నరసింహ, రాహుల్, ఏఐఎస్ఎఫ్ నేత క్రాంతి, పవన్ దేవాన్ష, పార్థు, కళ్యాణ్, సతీస్, నగేష్, శివ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రథమ లక్ష్యం

- ప్రజాభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం
- బేగంపేట్ సర్కిల్ పరిధిలో రూ. 100 కోట్ల పన్నుల వసూళ్లు
- మహంకాళి జాతరకు విస్తృతమైన ఏర్పాట్లు
- 'సాక్షి'తో డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బేగంపేట్ జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలో ప్రజాభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వెల్లండి సమ్మయ్య చెప్పారు. సర్కిల్ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ట్యాక్స్ వసూళ్లు, వీధులు, కాలనీలు, బస్తీల్లో చెత్తాచెదారం తొలగింపు, పార్కుల ఆధునీకీకరణ, వీధిదీపాల ఏర్పాటు, నూతన రోడ్ల నిర్మాణం వంటి తదితర అంశాలపై సాక్షితో నిర్వహించిన ముఖాముఖిలో వెల్లడించారు.

ప్రశ్న: జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ పనితీరు గురించి..

డిప్యూటీ కమిషనర్: బేగంపేట్ సర్కిల్ పరిధిలో బన్సీలాల్‌పేట్, రాంగోపాల్‌పేట్, బేగంపేట్, మోండా మార్కెట్ డివిజన్లు విస్తరించి ఉన్నాయి. వీటి పరిధిలో పౌర సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. రోడ్లు, వీధిదీపాల ఏర్పాటు, చెత్తాచెదారం తొలగింపు, పార్కుల సుందరీకరణ, అక్రమ కట్టడాల తొలగింపు, దోమల నివారణ వంటి అనేక పనులు నిర్వహిస్తున్నాం. ప్రజల నుంచి వచ్చే ఫిర్యా దులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం.

ప్రశ్న: వరదనీటి సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి..

డిప్యూటీ కమిషనర్: రానున్న వర్షాకాలంలో వరద నీటి వల్ల ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా అనేక చర్యలు తీసుకుంటున్నాం. తమ సర్కిల్ పరిధిలో వరదనీటి నిలిచే సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డు కర్బలామైదాన్, పద్మారావునగర్ దండు నివాసం రోడ్డు, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ప్రకాష్‌నగర్ ప్రాంతాలను గుర్తించాం. వర్షాకాలంలో వరదనీటి వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ట్రాఫిక్ పోలీసులతో కలిసి నిర్దిష్టమైన ప్రణాళికలను రూపొందించాం. వర్షాకాలంలో 24 గంటల పాటు తమ సిబ్బంది అందుబాటులో ఉంటూ వరదనీటి సమస్యను పరిష్కరించే విధంగా ఏర్పాట్లు చేశాం.

ప్రశ్న: మహంకాళి జాతర ఉత్సవాల సందర్భంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఎలాంటి పనులు చేపడుతున్నారు?

డిప్యూటీ కమిషనర్: మహంకాళి జాతర సందర్భంగా దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అనేక ఏర్పాట్లు చేస్తున్నాం. దేవాలయం చుట్టూ లైటింగ్ ఏర్పాట్లు, రోడ్లకు మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక టాయ్‌లెట్లు, ఫలహారపు బండ్ల ఊరేగింపునకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చెట్ల కొమ్మలను తొలగిస్తున్నాం.

ప్రశ్న: బేగంపేట్ సర్కిల్ పరిధిలో ట్యాక్స్ వసూళ్ల గురించి..

డిప్యూటీ కమిషనర్: బేగంపేట్ సర్కిల్ పరిధిలో ట్యాక్స్ వసూళ్ల కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. గత ఆర్థిక సంవత్సరం రికార్డు స్థాయిలో వసూళ్లు చేశాం. బేగంపేట్ సర్కిల్ పరిధిలో 2023-24 సంవత్సరానికి రూ. 100 కోట్లు వసూలు చేయడం జరిగింది. గతంతో పోల్చుకుంటే 14.5 శాతం అధికంగా వసూలు చేశాం.

ప్రశ్న: అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిప్యూటీ కమిషనర్: ఇళ్లు, వాణిజ్య సముదాయాల నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సకాలంలో అనుమతులు ఇస్తున్నాం. ఎక్కడ ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా నిబంధనలకు అనుగుణంగా అనుమతులు మంజూరు చేయడం జరుగుతుంది. వచ్చిన అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు సాగించే వారికి ముందస్తు నోటీసులిచ్చి కూల్చివేతలు చేపడుతున్నాం.

ప్రశ్న: ప్రజా సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు..

డిప్యూటీ కమిషనర్: ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నాం. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఆయా విభాగాలకు పంపి త్వరితగతిన సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. సర్కిల్‌లో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి తీసుకుంటున్నాం. అదే విధంగా రోజువారీగా ప్రజలు నేరుగా వచ్చి కూడా తమ సమస్యలను తమ దృష్టికి తీసుకురావచ్చు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం.

కళా సిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

లాలాపేట: తార్నాకలోని ఐఐసిటీ స్టాఫ్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కళా సిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శన శనివారం ప్రారంభమైంది. చేనేత కళాకారులను మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళా సిల్క్ సొసైటీ ప్రతినిధి వికాస్ జైన్ పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే పోచంపల్లి చీరలు, బెడ్ షీట్స్, వెస్ట్ బెంగాల్ జాందాన్ని చీరలు, రాజస్థానీ కోటా చీరలు, మంగళగిరి, ఉప్పాడ, చీరాల, వెంకటగిరి, ధర్మవరం చీరలు ప్రదర్శనలో అందుబాటులో ఉంచామన్నారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీలకు హవ్య ఎంపిక



సాక్షి, సిటీబ్యూరో: వచ్చే నెలలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు హైదరాబాద్ బాలిక ధూళిపూడి హవ్య ఎంపికైంది. రంగారెడ్డి జిల్లా ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో హవ్య చక్కని ప్రదర్శన కనబరిచింది. రెండు కేటగిరీల్లో మంచి టైమింగ్‌ను నమోదు చేసింది. అండర్-11 సబ్ జూనియర్ బాలికల విభాగంలో పోటీపడిన హవ్య 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ కేటగిరీలో రెండోస్థానం, 50 మీటర్ల బటర్ ఫ్లై కేటగిరీలో మూడో స్థానం సాధించింది. ఈ ప్రదర్శనతో జూలై 13, 14 తేదీల్లో సికింద్రాబాద్ వేదికగా జరగనున్న రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు హవ్య ఎంపికైంది.

సీవరేజీ ప్లాంట్ ప్రారంభం

రసూల్‌పురా: తిరుమలగిరిలో 15వ ఫైనాన్స్ నిధులు రూ.3.5 కోట్ల వ్యయంతో చేపట్టిన చెరువు అభివృద్ధిలో భాగంగా మురుగునీరు చెరువులోకి చేరకుండా చేపట్టిన అవుట్‌లెట్ పంపింగ్ వ్యవస్థను శనివారం కంటోన్మెంట్ బ్రిగేడియర్ సోమశంకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బోర్డు సీఈవో మధుకర్ నాయక్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, ఇంజనీరింగ్ అధికారి ఉమాశంకర్ పాల్గొన్నారు.

మొబైల్ యాప్ విడుదల

లాలాపేట: జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్), ఐసీఎంఆర్ రూపొందించిన న్యూట్రీఫైడ్ ఇండియా ఎన్ఐఎన్ 2.0 మొబైల్ యాప్‌ను శనివారం విడుదల చేశారు. మెరుగైన ఆరోగ్యం కోసం, తీసుకునే ఆహారం ఆధారంగా తగిన సిఫారసులను తెలుపుతుండంతో పాటు పాటు ఆహారపు అలవాట్లను మెరుగుపరచడానికి ఈ యాప్ ఎంతగానో శారీరక శ్రమను ట్రాక్ చేయడంతో పాటు తీసుకోవాల్సిన పోషకాహార వివరాలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని ఎన్ఐఎన్ అధికారులు తెలిపారు. రోజు తీసుకునే ఆహారపు సూచనలు, బేసల్ మెటాబాలిక్ రేట్(బీఎంఆర్), బాడీ మాస్ ఇండెక్స్(బీఎంఐ), శక్తి సమతుల్యత, శరీర బరువు, తీసుకోవాల్సిన తాగునీరు, నిద్ర తదితర వివరాలను తెలియజేస్తుందన్నారు. 24 గంటల్లో శక్తి వినియోగం, తీసుకోవాల్సిన ఆహార వివరాలను తెలియజేస్తుందన్నారు. ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న రాజారావు



అబ్దుల్ రహీంను సన్మానిస్తున్న ఉద్యోగులు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహించి నేటితో పదవీ విరమణ చేయనున్న ఉద్యోగులకు ఘనంగా సన్మానించారు. గాంధీ సెమినార్ హాల్లో శనివారం జరిగిన అభినందన కార్యక్రమంలో పదవీ విరమణ పొందుతున్న లెక్చరర్ వెంకటరామనర్సయ్య, గ్రేడ్-2 ఫార్మాసిస్ట్ పద్మశ్రీ, మార్చురీ అసిస్టెంట్ (ఎంఎన్ఓ) మహ్మద్ సలీమ్‌కు గాంధీ సూపరింటెండెంట్ రాజారావు శాలువా కప్పి సన్మానించారు. చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేసేవారికి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓలు జయకృష్ణ, ఏట సుభాన్, ప్రభుకిరణ్, బ్రహ్మేశ్వర్, యోగేశ్వర్, చీఫ్ డైటీషియన్ రమేష్, గ్రేడ్-1 ఫార్మాసిస్ట్ సుధాకర్, ఆస్పత్రి పాలనాయంత్రాంగం, టీఎన్‌జీవో ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీసీబీ ఉద్యోగికి..

సనత్‌నగర్: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ)లో 36 ఏళ్ల పాటు డ్రైవర్‌గా విధులు నిర్వర్తించిన మొహమ్మద్ అబ్దుల్ రహీం శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ రఘు, ఉద్యోగులు ఆయనను సత్కరించి వీడ్కోలు పలికారు. డ్రైవర్‌గా విజయవంతంగా విధులు నిర్వహించారని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంతి జీవితం ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. తన ఇన్నేళ్ల ప్రస్థానంలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రహీం కృతజ్ఞతలు తెలిపారు.

ఓయూలో 22 మంది..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో 22 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. శనివారం పాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.అర్జున్ రావు, పొలిటికల్ సైన్స్ హెడ్ ప్రొ.చంద్రు, నిజాం కాలేజీ జంతుశాస్త్రం విభాగం డా.పద్మజాతో పాటు 19 నాన్‌టీచింగ్ స్టాఫ్ (బోధనేతర సిబ్బంది)ని శాలువాలతో సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు.

గాయత్రినగర్ నాలా పనులను పూర్తి చేయాలి



అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ గాయత్రి నగర్ కాలనీలో నాలా పనులను త్వరగా పూర్తి చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం కాలనీ అసోసియేషన్ నాయకులు అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారితో కలిసి వెళ్లి ఎమ్మెల్యేను కలిసి సమస్యను విన్నవించారు. గత ప్రభుత్వ హయాంలోనే నాలా పనులకు నిధులు మంజూరు కాగా ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయని వినతిలో పేర్కొనగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు.

బల్కంపేటలో ట్రాఫిక్ డీసీపీ పర్యటన



అమీర్‌పేట: బల్కంపేటలో శనివారం ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే పర్యటించారు. వచ్చే నెల 8,9,10 తేదిలలో ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం జరగనున్న నేపథ్యంలో దేవాలయ పరిసర ప్రాంతాలతో పాటు ఏర్పాట్లను పర్యవేక్షించారు.భక్తుల వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ దారి మళ్లింపు వంటి అంశాలపై స్థానిక అధికారులతో చర్చించారు. భారీగా తరలివచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు డీసీపీ వెల్లడించారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య



అడ్డగుట్ట: అప్పుల బాధ భరించలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన లాలాగూడ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. లాలాపేటలోని సాయి నగర్ ప్రాంతానికి చెందిన మాధురి (28)కి తొమ్మిది ఏళ్ల క్రితం సైదులుతో వివాహం జరిగింది. ఇటీవల తలెత్తిన ఆర్థిక ఇబ్బందులు కారణంగా మాధురి తీవ్ర మనస్తాపానికి లోనైంది. శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

కుల వివక్షను రూపుమాపాలి



సమావేశంలో మాట్లాడుతున్న పులి కల్పన

లాలాపేట: ఎస్సీ ఎస్టీల పట్ల కులం పేరుతో వివక్షతను పాటించకుండా కుల వివక్షను రూపు మాపాలని హైదరాబాద్ జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు పులి కల్పన అన్నారు. శనివారం మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో లాలాపేట ఇసుకబాయి కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవ అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. సమాజంలో కులమత వైషమ్యాలు పెంచుకోకుండా అందరూ సోదరభావంతో మెలగాలన్నారు. భారత రాజ్యాంగం, చట్టాలు, హక్కులు, పథకాలపై అవగాహన కల్పించారు. దళిత అభివృద్ధి శాఖ అధికారి జహీరోద్దీన్ మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టల్లో విద్యార్థులను చేర్పించాలని విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అంబేడ్కర్ విద్యానిధి పథకం ద్వారా రూ. 20 లక్షల ఆర్థిక సహాయం ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు. బస్తీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పునరుద్ధరించి, కమ్యూనిటీ హాల్‌కు తాగునీటి కనెక్షన్, ఇళ్లు లేనివారికి పక్కా ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో రెవెన్యూ అధికారులు సర్వేశ్వర్, మల్లేశ్వర్‌రెడ్డి, బస్తీ నాయకులు మణెమ్మ పాల్గొన్నారు.

ఎంసీఈఎంఈలో అత్యంత శిక్షణ ప్రమాణాలు

రసూల్‌పురా: ఆధునిక రక్షణ సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన నైపుణ్యాలతో కూడిన అత్యంత శిక్షణా ప్రమాణాలు ఎంసీఈఎంఈలో ఉన్నాయని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్ సీఈవో రమేష కంచర్ల అన్నారు. తిరుమలగిరి ఎంసీఈఎంఈలో శనివారం 105వ స్నాతకోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ (టీఈఎస్) 41 కోర్సు పూర్తి చేసిన 22 మంది యువ అధికారులకు జేఎన్‌యూ బీ-టెక్ డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యాధునిక పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యం కలిగిన యువ అధికారులు జాతీయ భద్రతకు గణనీయమైన సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నారని అభినందించారు. ఎంసీఈఎంఈ కమాండెంట్, లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నే మాట్లాడుతూ.. యువ అధికారులు భారత సైన్యం ఆధునీకరణ వ్యూహాత్మక సముచిత సాంకేతిక పురోగతిని ఏకీకృతం చేయడానికి కృషి చేయాలన్నారు. డిగ్రీ పట్టాలు పొందిన వారిలో ముగ్గురు రాయల్ భూటాన్ ఆర్మీ, ఇద్దరు శ్రీలంక ఆర్మీ అధికారులు ఉన్నారన్నారు. లెఫ్టినెంట్ థోరట్ సందేష్ సంజయ్‌కు జీవోసీ ఇన్ చీఫ్ ఏఆర్‌టీఆర్ఏసీ ట్రోఫీ, డీజీఈఎంఈ గోల్డ్‌మెడల్ అందుకున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రసూల్‌పురా: దేశ భద్రత విషయంలో సైనికులు ఏ విధంగా వ్యవహరిస్తారో ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలోనూ అదే విధంగా వ్యవహరించాలని బేగంపేట ట్రాఫిక్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్ రాజు పేర్కొన్నారు. బొల్లారంలోని బైసన్ డివిజన్ 554 ఆర్మీ ఏఎస్‌సీ యూనిట్‌లో సైనికులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం జరిగిన యుద్ధంలో మరణిస్తే వీర మరణం అంటారని.. రోడ్డు నిబంధనలు పాటించకుండా మరణిస్తే దుర్మరణం అంటారని రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది సైనికులు తమ ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. దేశ భద్రత కోసం కఠినమైన శిక్షణ పొందిన సైనికులు రోడ్డు భద్రత పాటించడంలో కొన్నిసార్లు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించడం బాధ్యతగా భావించాలన్నారు.

రహదారులు ఛిద్రం.. రాకపోకలు జర భద్రం!



సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీ ప్రాంతానికి చెందిన రహదారులు ఛిద్రం కావడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బీదల బస్తీలో అసలే ఇరుకైన రహదారులు దానికి తోడు ధ్వంసం కావడంతో ప్రమాదకరంగా మారాయని బీదలబస్తీ ప్రతినిధి, న్యాయవాది ఎం. సురేంద్రకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారులు పునర్నిర్మించాలని జీహెచ్ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. - సికింద్రాబాద్

బ్రేక్‌డౌన్.. ట్రాఫిక్ జామ్

తార్నాక ప్రధాన రహదారిలో ఉదయం 16 టైర్ల భారీ లారీ బ్రేక్‌డౌన్‌తో తార్నాక ప్రధాన రహదారిలో ట్రాఫిక్ జామ్ తలెత్తింది. దీంతో ఆ రహదారి మీదుగా రాకపోకలు సాగించే వారు నానా ఇక్కట్లకు గురయ్యారు. అయితే..లారీ డ్రైవర్ పత్తాలేకుండా పోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించింది. - లాలాపేట

